క్లుప్తంగా

## యాదాద్రి పవర్ ప్లాంట్‌లో వైద్యశిబిరం



కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల పరిధిలో గల యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని కార్మికులకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లోని 464 మంది కార్మికులకు ఐదు వైద్య బృందాలతో పరీక్షలు నిర్వహించగా 62 మంది కార్మికులు జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. వీరి రక్త నమూనాలను జిల్లా ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. కార్మికులు అనారోగ్యం పాలవకుండా వైద్యులు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి మందులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు 220కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే అన్ని 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు దామరచర్ల ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు. మిర్యాలగూడ మున్సిపాలిటీతోపాటు, మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామాలకు, దామరచర్లలోని నూనావత్ తండా, రాళ్లవాగుతండా, కొండ్రపోల్, కేశవాపురం తోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్రిపురారం : మిర్యాలగూడలోని సబ్‌స్టేషన్‌లో 220 కేవీ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు త్రిపురారం మండలంలోని త్రిపురారం, నీలాయిగూడెం, మాటూర్, పెద్దదేవులపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మణిదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాడుగులపల్లి, మర్రిగూడెం, దాచారం, ఇందుగుల, కుక్కడం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి

దేవరకొండ: ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహరాజ్ 150వ జయంతిని బుధవారం దేవరకొండలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేఏసీ నాయకుడు కంబాలపల్లి వెంకటయ్య మాట్లాడుతూ సాహు మహరాజ్ బహుజన సమాజం కోసం అనేక సంస్కరణలతో విద్యా,వైద్యం అందించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆరెకంటి ఏసయ్య, ఎర్ర ఆంజనేయులు, నల్ల మహేష్, సలాం, చంద్రయ్య, అంకూరి మోషె, నజీర్, శేఖర్, తదితరులున్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులతో పాటు తెల్లరేషన్ కార్డుదారులకు కల్పిస్తున్న కార్మిక బీమాను సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభిరామ్ కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి కేవలం 22 రూపాయలు మాత్రమేనని, ఐదేళ్లకు ఒక్కసారి 110 రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయస్సు వరకు మహిళలు, పురుషులు అర్హులైన వారందరు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పాలసీదారుల సహజ మరణం అయితే 1.30లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షలు నామినీకి వస్తాయని, ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానాగా రూ.30 వేలు చెల్లిస్తారని తెలిపారు. అర్హులైన వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు చాలానా వంటివి జత చేసి కార్మిక శాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

## కుర్మేడులో చైన్‌స్నాచింగ్

కొండమల్లేపల్లి(చింతపల్లి) : గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. చింతపల్లి మండలం కుర్మేడు గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కుర్మేడు గ్రామానికి చెందిన గోరెటి బక్కమ్మ వ్యవసాయ పొలానికి వెళ్లి హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై నడుచుకుంటూ తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇది ఏ ఊరు పెద్దమ్మ అని అడుగుతూ ఆమె మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. బాధితురాలు చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

# ‘ఇంటిగ్రేటెడ్’ ఇంకెన్నాళ్లో..?

- నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణం
- హాలియాలో రూ. 2 కోట్లతో పనులు
- 2022లో ప్రారంభమైనా ఇంకా ఫస్ట్ ఫ్లోర్‌లో స్లాబ్ దశలోనే..
- డిజైన్ మారడమే అసలు సమస్య



హాలియా ఎడమ కాల్వ పక్కన అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం

హాలియా : రోజురోజుకూ విస్తరిస్తున్న హాలియా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు అధిగమించడంతో పాటు అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ విక్రయాలు ఒకే చోట ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. హాలియా మున్సిపాలిటీలో గత ప్రభుత్వం రూ. 2కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. పట్టణంలోని ఎడమ కాల్వ సమీపంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 2022లో ప్రారంభమయ్యాయి. అయితే ఈ పనులు ఆది నుంచి నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పాటు అధికారులు డిజైన మార్చి అదనంగా మరో రూ.4.50 కోట్లకు ప్రతిపాదనలు పంపడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం రూ.1.70కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు.

**ఇంటిగ్రేటెడ్‌లో చేపట్టే పనులు ఏమిటంటే..**

పట్టణంలోని రెండెకరాల స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించే ఈ మార్కెట్‌లో కూరగాయల (వెజిటేరియన్)కు 26 దుకాణాలు, 8 పూల దుకాణాలు, మటన్, చికెన్, చేపల(నాన్‌వెజ్)కు 14 దుకాణాల చొప్పున కేటాయించనున్నారు. వ్యాపారులు నష్టపోవద్దనే ఉద్దేశంతో ఈ దుకాణాల సముదాయంలో వెజ్, నాన్‌వెజ్‌కు వేర్వేరుగా సదుపాయాన్ని కల్పించనున్నారు. అదే విధంగా మార్కెట్ వచ్చే వినియోగదారులకు మంచినీటి వసతితో పాటు పార్కింగ్ స్థలాన్ని సైతం అందుబాటులో ఉండనుంది. మార్కెట్‌కు వచ్చే వినియోగదారుడికి కూరగాయలు, మాంసం, చేపలు ఒకేచోట దొరకనున్నాయి. వాటి ధరల కోసం డిజిటల్ బోర్డులు అమర్చనున్నారు. దీనితో వినియోగదారుడికి సమయం ఆదాతో పాటు తాజా సరుకులు లభించేలా ఏర్పాట్లు చేయనున్నారు. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు.

**ప్రజలకు ప్రయోజనకరం**

హాలియాతో పాటు తిరుమలగిరి(సాగర్), పెద్దవూర, నిడమనూరు మండలాల నుంచి నిత్యం పట్టణానికి వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగపడనుంది. కూరగాయల వ్యాపారులు, మాంసం వ్యాపారులు హోల్‌సేల్‌గా విక్రయించడంతో పాటు రిటేల్‌గా అమ్ముకునే సౌకర్యం కలగనుంది. వినియోగదారుడికి లాభం చేకూరడంతో పాటు వ్యాపారులకు సైతం సౌకర్యవంతంగా మారుతుంది.

### మార్కెట్ పనులు పూర్తి చేసేందుకు కృషి

హాలియాలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రస్తుతం ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తయ్యాయి. ఈ మార్కెట్ నిర్మాణ రీడిజైన్ కోసం మరో రూ. 4.50కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపాము. పనులు చేసేందుకు ప్రభుత్వం నుంచి జీఓ కూడా వచ్చింది. త్వరలో ఈ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వెన్నలకుమార్, పబ్లిక్ హెల్త్ ఏఈ

# త్వరలో నాలుగు ఫ్లైఓవర్ల నిర్మాణం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అధికారులతో కలిసి మిర్యాలగూడలో రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలో త్వరలో నాలుగు ఫ్లైఓవర్లను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా మిర్యాలగూడలోని రహదారులపై రోడ్డు ప్రమాదాలకు అనేక మంది మృత్యువాత పడుతున్నారన్న విషయాన్ని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారన్నారు. దీంతో బుధవారం ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారి, ఆర్డీఓ, డీఎస్పీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ అధికారులతో కలిసి పట్టణంలోని వై జంక్షన్, నందిపాడు జంక్షన్, చింతపల్లి బైపాస్, ఈదులగూడ బైపాస్‌లను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణంతోపాటు సర్వీస్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా వేములపల్లిలో క్యాంప్‌లో ప్రజలు రహదారిని దాటే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని అక్కడ అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వార్షిక బడ్జెట్ అంచనా వ్యయం రూ.492.75 లక్షలు



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు, కౌన్సిలర్లు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ 2024–25 వార్షిక బడ్జెట్ అంచనా వ్యయం రూ.492.75 లక్షలుగా అంచనా వేశారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అన్నపూర్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గృహాల నుంచి పన్నుల రూపేణ రూ.50 లక్షలు, నాన్‌ట్యాక్సెస్ రూ.54.75 లక్షలు, గ్రాండ్స్ రూపేణ రూ.385 లక్షలు రాబడి వస్తుందని అంచనా వేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వేతనాల కింద రూ.93.67లక్షలు, పాత బకాయిలు రూ.12.08 లక్షలు, అభివృద్ధి పనులకు రూ.385 లక్షలు వ్యయం కానున్నట్లు పేర్కొన్నారు. అంచనా వ్యయం అనుకున్న ప్రకారం నగదు రూపేణ వస్తే కొంతమేరకు నందికొండ మున్సిపాలిటీలో అభివృద్ధి జరుగుతుందని కౌన్సిల్ అభిప్రాయపడింది. సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు రమేష్, మంగ్తానాయక్, మంద రఘువీర్, రామకృష్ణ, నిమ్మల ఇందిర పాల్గొన్నారు.

## ఎంపీలకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



ఢిల్లీలో ఎంపీలకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఇతర నాయకులు

మిర్యాలగూడ : పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలను ఢిల్లీలో బుధవారం డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీలను కలిసిన వారిలో నాయకులు పగిడి రామలింగయ్య, గాయం ఉపేందర్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, పొదిల వెంకన్న, గాజుల శ్రీనివాస్, కాకునూరి బసవయ్యగౌడ్, రాగిరెడ్డి జగ్గారెడ్డి, చలపతిరావు, ఇజ్రాయిల్, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, శివనాయక్ ఉన్నారు.

## గోర్ బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

దేవరకొండ: లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 1న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనంలో గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ వాంకునావత్ బిక్కునాయక్, పాపానాయక్, కేతావత్ నాగేశ్వర్‌నాయక్, ముఢావత్ లక్పతినాయక్, పాండునాయక్ , సుక్కు నాయక్, శక్రునాయక్, పాండునాయక్, కేతావత్ బాబురాం, నారాయణ నాయక్ ఉన్నారు.

### ఎంపీడీఓకు వినతి

కొండమల్లేపల్లి : రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి రమేశ్ బుధవారం కొండమల్లేపల్లి ఎంపీడీఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని సాగర్ రోడ్డు హైవే నుంచి చింతచెట్టుతండా, జేబీకి వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలుగా మారి అధ్వానంగా తయారైందని వివరించారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఏబీవీపీ నగర కార్యదర్శి బొల్లేపల్లి మధుమోహన్‌రాజు
- పాఠశాలల బంద్ విజయవంతం



మిర్యాలగూడ : పాఠశాలల బంద్‌లో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలు



దేవరకొండ : డీఆర్ఎస్ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి బొల్లేపల్లి మధుమోహన్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ విజయవంతమైంది. అనంతరం ర్యాలీ నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పాలకులు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందించలేదని విమర్శించారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకవస్తామని ప్రకటించిన పాలక ప్రభుత్వం నేటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి పేదలకు విద్యకు దూరమవుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలక ప్రభుత్వాలకు విద్యార్థిలోకం బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పగిడిపల్లి శ్రీకాంత్, తలుపూరి కీర్తి, మాలోతు మల్లీశ్వరీ, కంభం అభి, చక్రవరం నాగరాజు, వెంకటేష్, ఉప్పుతల పార్థసారథి, రాకేష్, రవి, మధు, శివసాయి ఉన్నారు.

**ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి**

దేవరకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. మండల పరిధిలోని డీఆర్ఎస్ పాఠశాల బంద్ పాటించక పోవడంతో ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు యలమల గోపిచంద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అంకూరి శ్రీకాంత్, హేమ సుందర్, అమితేష్, భరత్, అరవింద్, మహేందర్, శ్రీమరి, సైదులు, తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తొలుత అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అర్వపల్లి సరితానర్సింహ, ఎంపీడీఓ చంద్రమౌళి,ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేశారు. ఈ మేరకు ఇసుక తరలింపుకు కారణమైన కుందేళ్ల శ్రీకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.రాజు తెలిపారు.

# మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



మిర్యాలగూడ : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హాలియా: ర్యాలీలో పాల్గొన్న నాయకులు, పోలీసులు, విద్యార్థులు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- అంతటా ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

మిర్యాలగూడ : మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని, మాదకద్రవ్యాలు సేవించినా, అమ్మిన వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగార్జున, సుధాకర్, వీరబాబు పాల్గొన్నారు.

**దామరచర్లలో ర్యాలీ**

డ్రగ్స్ నిర్మూలన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలో ఎస్‌ఐ ఇరుగు రవి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

**కళాశాల విద్యార్థుల ర్యాలీ**

మిర్యాలగూడ అర్బన్: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేఎన్ఎం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య, అధ్యాపకులు రాంరెడ్డి, సునంద, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నర్సింగ్ కోటయ్య, నరేందర్, శ్రీను, ప్రాన్సిస్ ఉన్నారు.

**హాలియాలో..**

హాలియా : మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని సీఐ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు వర్ర వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, ప్రసాద్‌నాయక్, నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, కుకుడాల ఆంజనేయులు, చెరుపల్లి ముత్యాలు ఉన్నారు.

**యువత మత్తులో చిత్తు కావొద్దు**

తిరుమలగిరి(నాగార్జునసాగర్): యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ నారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎంఎన్‌ఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు భాను, అమృతయ్య, సరోజినిదేవి పాల్గొన్నారు.

**అడవిదేవులపల్లిలో..**

అడవిదేవులపల్లి : మత్తు పదార్థాల నియంత్రణపై బుధవారం అడవిదేవులపల్లి ఎస్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ నియంత్రణకు కృషి చేద్దాం అంటూ బస్టాండ్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, పోలీసులు అంజి, గిరి, పూర్ణ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

**మత్తుకు బానిసలు కావద్దు**

నిడమనూరు: యువత మత్తు పదార్థాలకు బానాసలు కావద్దని ఎస్‌ఐ గోపాల్‌రావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ – అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మోడల్ స్కూల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**మత్తుకు దూరంగా ఉండాలి**

వేములపల్లి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాదకద్రవ్యాల నిర్మూల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపేందర్, పాల్గొన్నారు.

**గుర్రంపోడులో..**

గుర్రంపోడు : మండలకేంద్రంలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను ఎస్‌ఐ బి.శివప్రసాద్ వివరించారు.

**డిండిలో అవగాహన ర్యాలీ**

డిండి: అఅంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ.రాజు మాదవద్రవ్యాల వాడకంపై కలిగే నష్టలను వివరించారు.

### డ్రగ్స్ రహిత సమాజానికి నడుం బిగించాలి



దేవరకొండ : ర్యాలీలో మాట్లాడుతున్న డీఎస్పీ

దేవరకొండ: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అన్నారు.బుధవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్,ఎక్సైజ్ శాఖ, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు,యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నర్సింహులు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఎస్‌ఐలు రమేష్,సైదులు, సభ్యులు ఉమామహేష్, వైఎస్ కరుణా కర్,తాళ్ల సురేష్,మహమూద్ ఉన్నారు.

**మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన**

కొండమల్లేపల్లి : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ధనుంజయ, ఎస్‌ఐ రామ్మూర్తి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారొద్దని కోరారు.

**చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి**

పెద్దవూర: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని ఎస్‌ఐ పి.వీరబాబు అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

**డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరం**

త్రిపురారం : మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ వీర శేఖర్ అన్నారు. బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలంపల్లి జానయ్య, హెచ్‌ఎం రవి కుమార్ నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గుర్రంపోడు : అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ



డిండి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



కొండమల్లేపల్లి: అవగాహన కల్పిస్తున్న పోలీసులు



పెద్దవూర : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



త్రిపురారం : అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ